క్లుప్తంగా

వైద్యుల పాత్ర కీలకం



గైనకాలజిస్టు పద్మను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: సమాజంలో వైద్యుల పాత్ర చాలా కీలకమైనదని కాకతీయ విద్యానికేతన్ కరస్పాండెంట్ నిర్మలాదేవి తెలిపారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ గైనకాలజిస్టు వైద్యురాలు పద్మను ఘనంగా సన్మానించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. రోగుల ప్రాణాలు నిలిపే వైద్యులు భగవంతునితో సమానమన్నారు. పాఠశాల డైరెక్టర్ శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మంచి వైద్యులుగా రాణించి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు దోహదపడాలని తెలిపారు. అనంతరం స్పందన ఆస్పత్రి వైద్యులు టీఎం బషీర్, విజయలక్ష్మి డాక్టర్ మదన్‌మోహన్‌ను కాకతీయ విద్యానికేతన్ విద్యార్థులు నేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ శెట్టిపి పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి



టీచర్లను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

పుట్టపర్తి: ఇటీవల బదిలీ అయిన టీచర్లు ఆవుటాల కృష్ణమ్మ, ఇందిరకు పుట్టపర్తి శివాలయం వీధి ప్రాథమిక పాఠశాల సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం రజనీకాంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఈఓలు ఖాదర్ వలిబాషా, ప్రసాద్, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి తదితరులు హాజరయ్యారు. బదిలీ అయిన టీచర్ల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఎక్కడ ఉద్యోగం చేసినా అంకితభావంతో బోధన చేయాలని ఎంఈఓలు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బసోబీ, చంద్రకళ, అనిత, కళ్యాణి, నర్మద, క్రిష్ణవేణి ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులు కండీషన్‌లో లేకపోతే కేసులు



పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంవీఐ రాణి

ధర్మవరం అర్బన్: స్కూల్ బస్సులు కండీషన్‌లో లేకపోతే కేసులు నమోదు చేస్తామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) కె.రాణి హెచ్చరించారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులోనున్న ఆర్టీఓ కార్యాలయంలో మంగళవారం ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రాణి మాట్లాడుతూ ప్రతి స్కూల్ బస్సుకూ ట్యాక్స్, ఎఫ్‌సీ, పర్మిట్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. బస్సు సీటింగ్ కెపాసిటీని బట్టి విద్యార్థులను ఎక్కించుకోవాలని సూచించారు. అపరిమితంగా విద్యార్థులను బస్సులో ఎక్కించుకుంటే కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. బస్సులో విద్యార్థులను ఎక్కించుకునేందుకు అటెండర్ కచ్చితంగా ఉండాలని ఆదేశించారు. డ్రైవర్లు లైసెన్సు కలిగి ఉండాలన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ తిప్పేంద్రనాయక్ మంగళవారం డాక్టర్ మాధవి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వైద్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ మాట్లాడుతూ రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న స్ఫూర్తిని ప్రజలందరికీ అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే



వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం: పట్టణంలోని రిషి విద్యాలయంలో మంగళవారం డాక్టర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు సుబ్బారావు, ఆదిశేషులను పాఠశాల నిర్వాహకులు కరణ్ స్వరూపాసింగ్, ఉపాధ్యాయులు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం విద్యార్థులకు వైద్యుల గొప్పతనాన్ని వివరించారు. ప్రతి విద్యార్థీ బాగా చదువుకుని వైద్యులు కావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్ రెడ్డి, సీఏఓ రవీంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వామ్మో.. ఇదేం ట్రాఫిక్!

- పది నిమిషాలకోసారి బ్రేక్
- ముందుకు సాగని వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న కదిరి ప్రజలు

కదిరి అర్బన్: పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోతున్నాయి. కదిరిలో సుమారు లక్ష జనాభా ఉంది. నిత్యం వాహనాలతో రోడ్లు కిటకిటలాడుతున్నాయి. కోనేరు సర్కిల్, ఎంజీ రోడ్, వలీసాబ్ రోడ్‌లో ప్రతి పదినిమిషాలకోసం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. రాయసీమ సర్కిల్ నుంచి వెలుగు కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ చేయకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. కోనేరు నుంచి రాయసీమ సర్కిల్ వరకు కర్ణాటక, తమిళనాడు రాష్టాల నుంచి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. భక్తులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపి హోటళ్లకు వెళ్లడంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ ఏర్పడుతోంది. ఎంజీ రోడ్‌లో అయితే వ్యాపారులు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వాహనాల్లో లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తున్నారు. గార్డెన్ సిటీ బెంగళూరులో సైతం ఇంత ట్రాఫిక్ సమస్య ఉండదని స్థానికులు చెబుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవలే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వివిధ వ్యాపారాలు, ఆటోలు, కార్లు నడుపుకునే 400 మందిపై పట్టణ పోలీసులు న్యూసెన్స్ కేసులు నమెదు చేశారు. ఇందులో 40 మందికి కదిరి కోర్టు జరిమానా కూడా విధించింది.



రాయలసీమ సర్కిల్‌కు వెళ్లేదారిలో ఉత్తర గోపురం వద్ద ట్రాఫిక్ కష్టాలు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఐదుగురు హోంగార్డులను కేటాయించాం. శని, ఆదివారాల్లో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. హిందూపురం సర్కిల్ నుంచి కోనేరు సర్కిల్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతో అక్కడ తరచూ ట్రాఫిక్ సమస్య వస్తోంది. దీంతో డీఎస్పీ దృష్టికి తీసుకెళ్తే.. శని, ఆదివారాల్లో అదనంగా మరో ఇద్దరు సిబ్బందిని ట్రాఫిక్ విధులకు కేటాయించారు. టర్నింగ్‌లు, జంక్షన్‌లలోనే ఎక్కువ ట్రాఫిక్ సమస్య ఉంటుంది. అక్కడ మా సిబ్బందిని నియమించాం.

– నారాయణరెడ్డి, సీఐ, కదిరి పట్టణం

రోడ్డు విస్తరణతోనే పరిష్కారం



రాయలసీమ సర్కిల్ నుంచి వెలుగు కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ చేపడితే తప్ప ట్రాఫిక్ కష్టాలు తీరవు. 108 సైతం హిందూపురం సర్కిల్‌లో ట్రాఫిక్‌లో ఇరుక్కుందంటే రోగి ప్రాణాలు గాల్లో దీపమే. అంతేకాకుండా కర్ణాటక నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. జనసంచారం ఎక్కువగా ఉంటుంది. భక్తులు తెలియక రోడ్డుపై వాహనాలు పెడుతుంటారు. దీంతో కూడా ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి.

– వంశీరెడ్డి, కదిరి

రసాయనిక ద్రావకం తాగి గొర్రెలు మృతి

తాడిమర్రి: పూలోబయ్యపల్లి కాపరులకు చెందిన గొర్రెలు మంగళవారం రసాయనిక ద్రావకం కలిపిన నీరు తాగి మృతి చెందాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. జానకొండ సురేష్, ఆకులేటి ముత్యాలప్ప, గుండ్లమడుగు సూరి మంగళవారం ఉదయం తమ గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. బీడు భూములు, గుట్టల్లో మేపుకుంటూ నీటి కోసం నిడిగల్లుకు చెందిన ఓ రైతు తోటవద్దకు తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆ రైతు సాగు చేసిన మొక్కజొన్న పంటకు డ్రిప్పు ద్వారా అందించడానికి నీటితొట్టెలో రసాయనిక ద్రావకం కలుపుకున్నారు. ఇంతలో గొర్రెలు వచ్చి ఆ నీటిని తాగాయి. వెంటనే గొర్రెల కడుపులు ఊది ఏడు మృతి చెందాయి. మరికొన్ని గొర్రెలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి మహమ్మద్ యూనస్ సంఘటనా స్థలానికి వెళ్లి అస్వస్థతకు గురైన గొర్రెలకు చికిత్సలు అందించారు. మృతి చెందిన గొర్రెలకు ఆయన పోస్టుమార్టం చేశారు.



రసాయన ద్రావకం నీటిని తాగి మృతి చెందిన గొర్రెలు

- పిన్నదరి గ్రామానికి చెరదిన పటాన్ బాబా ఫక్రుద్దీన్‌కు చెందిన రెండు రెండు పొట్టేళ్లు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. పొట్టేళ్లను మేతకు తీసుకెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న తరుణంలో పాఠశాల వద్ద గ్రామ పంచాయతీ బోరు మోటర్ కోసం భూమిలో ఏర్పాటు చేసిన అర్త్ వైర్ వద్ద ఉన్న నీటిని తాగడానికి వెళ్లినపుడు కరెంట్ షాక్ కొట్టింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

‘ఆశా’ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు గౌతమి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గాంధీనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో నేసేపేటలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ గౌతమి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అభ్యర్థులు రెండు సెట్ల దరఖాస్తులను ఈ నెల నాలుగో తేదీ లోపు అర్బన్ హెల్త్ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌కు అందించాలని సూచించారు.

తాడిమర్రి: ఆత్మకూరు ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారి హరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న దేవేంద్రమ్మ ఏడాది క్రితం ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేయడానికి అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. గ్రామానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెంది పదో తరగతి ఉత్తీర్ణత చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ సామాజిక వర్గంలో అర్హులు లేకపోతే బీసీ సామాజిక వర్గం నుంచి భర్తీ చేస్తామని వివరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

ధర్మవరం రూరల్: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ధర్మవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి సూచించారు. మంగళవారం పట్టణంలోని తారాకరామాపురంలో ఉన్న మోడల్ స్కూల్, కళాశాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలను సేవించడం వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. చంద్రమణి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దన్నారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు వెళ్లేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ చాంద్‌బాషా, అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సునంద, సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

బత్తలపల్లి: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని బత్తలపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ డెంగీ వ్యాధి మాసోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం కచ్చితంగా డ్రైడే నిర్వహించాలని, లార్వా సర్వే, జ్వర సర్వే చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల గురించి ముఖ్యంగా డెంగీ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖర్, సూపర్‌వైజర్ అశ్వత్థనారాయణ, గౌరమ్మ, ఫార్మసీ ఆఫీసర్ సరస్వతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేంద్ర, ఆరోగ్య కార్యకర్తలు డేవిడ్, మారుతి, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



బత్తలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్, సిబ్బంది తదితరులు

అపరిశుభ్రత తొలగింపు



ఉద్యాన కార్యాలయం వద్ద శుభ్రం చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్దనున్న ఉద్యాన శాఖ కార్యాలయం వద్ద అపరిశుభ్రతను తొలగించారు. రెండు రోజుల క్రితం ‘ఉద్యానం ..అధ్వానం’ అనే శీర్షిక సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కార్యాలయం చుట్టూ ఉన్న అపరిశుభ్రత, చెత్తా చెదారాన్ని డోజర్‌తో తొలగించారు. మందుబాబుల కట్టడి కోసం పోలీసులు రాత్రి గస్తీని ముమ్మరం చేశారు.

మాజీ సీఎంను కలిసిన నేతలు



వైఎస్ జగన్‌ను కలిసిన సుధీర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గంగుల సుధీర్‌రెడ్డి, రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు మామిళ్లపల్లి అమర్నాథ్‌రెడ్డి మంగళవారం కలిశారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి నరేంద్రరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ యాదవ్ కూడా వైఎస్ జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నరేంద్రరెడ్డి, రాజేంద్రప్రసాద్ యాదవ్

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

బత్తలపల్లి: ఖరీఫ్‌లో తక్కువ పెట్టుబడితో అధిక పంట దిగుబడులు సాధించేందుకు వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలని ధర్మవరం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మానాయక్ కోరారు. మంగళవారం మండలంలోని తంబాపురం, అనంతసాగరం గ్రామాల్లో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏడీఏ లక్ష్మానాయక్ హాజరై మాట్లాడారు. తక్కువ పెట్టుబడి ద్వారా అధిక దిగుబడి ఎలా సాధించాలో రైతులకు వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో పొలాలను లోతు దుక్కులు దున్నుకోవడం, విత్తనశుద్ధి చేసుకోవడం, పంట మార్పిడి చేయడం, చీడపీడలను మొదటి దశలోనే గుర్తించి తక్కువ ఖరీదైన మందులను పంటలకు వినియోగించడం తదితర వాటి గురించి రైతులకు తెలియజేశారు. పురుగుమందుల పిచికారీ కోసం 80 శాతం సబ్సిడీపై డ్రోన్‌లను అందజేస్తామన్నారు. ఆసక్తి గల రైతులు మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



తంబాపురంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్

హక్కుల సాధనకు పోరాటం

పుట్టపర్తి టౌన్: లంబాడీల హక్కుల సాధనకు లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పోరాడతామని రాష్ట్ర ఉపాధ్యక్షులు రవినాయక్ తెలిపారు. మంగళవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రాంలో లంబాడీ హక్కుల పోరాట సమితి 29వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో లంబాడీల సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టిన కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు విజయకుమార్ నాయక్, నారాయణస్వామినాయక్, కుళ్లాయప్ప నాయక్, రమణానాయక్, గణేనాయక్, రంగనాథ్‌నాయక్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి

ముదిగుబ్బ: కొడవండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయులు శంకర్‌తో పాటు మరో 8 మంది ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అందించిన సేవలు ఎనలేనివని గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నల్లమాడ: దొన్నికోట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు యర్లప్ప నాయుడు (73) మంగళవారం మృతి చెందారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మరణ వార్త తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రసూల్, మండల ఉపాధ్యక్షులు గోపాల్‌నాయుడు, సీనియర్ నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, మైనార్టీ సెల్ మండల నాయకులు షంషీర్, బాలాజీనాయుడు, నాగార్జునాయుడు, ఆసాది ఆదినారాయణ, రామ్మోహన్ రెడ్డి తదితరులు దొన్నికోటకు వెళ్లి యర్లప్ప నాయుడు మృతదేహానికి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అండర్ -19 మహిళా క్రికెట్ పోటీలకు తేజస్విణి



తేజస్విణి

కదిరి అర్బన్: రాష్ట్రస్థాయి అండర్ -19 మహిళా క్రికెట్ ప్రాపబుల్స్ బి జట్టుకు కదిరిలోని సాధన పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తేజస్విణి ఎంపికైంది. ఇటీవల అండర్-19 జిల్లా జట్టుకు ఎంపికై నెల్లూరు జిల్లాలో జరిగిన అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో తేజస్విని కుడిచేతి పేసర్, ఫీల్డర్‌గా ప్రతిభ కనబరచిన విషయం విదితమే.

మొహర్రం ప్రశాంతంగా చేసుకోండి

తలుపుల: మండల వ్యాప్తంగా మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ నరసింహుడు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పీర్లు నిలిపి ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహించే వారు పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పర్మిషన్ ఉన్న గ్రామాల్లో పోలీస్ నిఘా వుంచి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడతామన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ మండలంలో సజావుగా సాగింది. సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, వీఆర్వోలు మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి పంపిణీ ప్రారంభించారు. మండలంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర సామాజిక పింఛన్లు మొత్తం 6,167 ఉన్నాయి. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు 5,855 మందికి పంపిణీ చేశారు.

పింఛన్ల పంపిణీ

నల్లచెరువు: ఉబిచర్ల గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా లబ్ధిదారులకు సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథగుప్తా, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



నోట్ పుస్తకాలు అందిస్తున్న దాతలు

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం లింగప్పగారిపల్లి ప్రాథమిక పాఠశాలలోని 35 మంది విద్యార్థులకు మంగళవారం పుట్టపర్తికి చెందిన అల్లా బకాష్ విద్యా సామగ్రి (పలకలు, నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు) అందించారు. కార్యక్రమంలో షాకీర్, హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులకు సన్మానం



వైద్యులను సన్మానిస్తున్న ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు రాజేశ్వరి, లక్ష్మి తదితరులు సన్మానించారు. సమాజంలో వైద్యుల పాత్ర చాలా కీలకమైనదని కొనియాడారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

పుట్టపర్తి టౌన్: పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీఓ జయంతి పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బందితో ప్రాజెక్ట్ లెవల్ మీటింగ్ నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిన్నారులలో పోషకాహారలోపం లేకుండా సురక్షితంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చిన్నారులలో పోషకాహార లోపం ఎలా గుర్తించాలి.. వారికి ఎలాంటి పోషకాహారం అందించాలనే అంశాలను వివరించారు. అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గ్రామాలలో వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, సూపర్‌వైజర్లు రజిత, సుజాత, పుష్పలత, భారతీదేవి, ఆరోగ్య కార్యకర్త మెహనాజ్ తోపాటు మూడు మండలాల అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

నాగుల కట్ట నిర్మాణానికి విరాళం

ధర్మవరం రూరల్: చిగిచెర్లలో నాగులకట్ట పునఃప్రతిష్ట కార్యక్రమానికి మంగళవారం ఏపీ స్పోర్ట్స్ మాజీ డైరెక్టర్ బుచ్చిరెడ్డి గారి ఓబిరెడ్డి రూ.10 వేలు విరాళంగా అందజేశారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సాయంగా విరాళాన్ని అందజేసినట్లు చెప్పారు.

సంక్షిప్త సమాచారం

కరూర్ వైశ్యా బ్యాంక్ వార్షికోత్సవం



బ్యాంకు వ్యవస్థాపకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ధర్మవరం రూరల్: పట్టణంలోని నేసేపేటలో కరూర్ వైశ్యా బ్యాంక్ వద్ద 109వ వార్షికోత్సవం బ్రాంచ్ మేనేజర్ కె.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. చేనేత పరిశ్రమ మీద ఆధారపడిన వారికి ధర్మవరం బ్రాంచ్ రుణ సదుపాయం కల్పించి ఆదుకుంటోందన్నారు. బ్యాంక్ వ్యవస్థాపకులు ఎంఏ వెంకటరామ చెట్టియార్, అతికృష్ణ చెట్టియార్ ఫౌండేషన్ డే సందర్భంగా ఈ వేడుకలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం గొట్లూరు వద్ద అనాథాశ్రమంలోని వృద్ధులకు, అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శివప్రసాద్, రాకేష్, కృష్ణ, అమర్, షఫీ, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

కనగానపల్లి: మండలంలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కనగానపల్లి పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కనగానపల్లి, తూంచర్ల గ్రామ పరిధిలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ లోపు కనగానపల్లి పీహెచ్‌సీలో నేరుగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.